అతడ్ని పరీక్షించే నెపంతో అనవసరంగా గాభరా పెట్టేశాను అనుకుంది.

తనకోసం కిరీటి ఎంత ఆందోళన చెందిందీ డాక్టరు వచ్చింది మొదలుకుని గుర్తుచేసుకుంటే ఎంతో తృప్తిగా వుంది అందర్నీ హడావిడి పెట్టేసినందుకు భాధగానూ వుంది.

ఈ నాటకాన్ని చాలించి అతడి ముందు అంతా చెప్పాయాలనిపించింది.

తననెంతగా ప్రేమిస్తున్నదీ తెలుసుకోవాలన్న ఆలోచనతో ఆమె ఇంత మూర్ఖంగా ప్రవర్తించానని పశ్చాత్తాప్పడాలనిపించింది.

అతడి గురించి సునీత యెంత నిజాయితీగా వూహించిందో ఆమెకు అర్ధంకావటంతో ఆమె మనసు మబ్బు విడిన ఆకాశంలా అయిపోయింది.

"ఇప్పుడెలా వుంది?"

కళ్ళు తెరిచిన కిరీటి గాభరగా అడుగుతుంటే ఆమెకళ్ళు ఆర్ద్రమయ్యాయి.

"పర్వాలేదు... మీరు రెస్టు తీసుకొండి..."అంది తల వంచుకునే.

ఇద్దరి మధ్యా కొన్ని నిమిషాలపాటు నిశ్శబ్దం.

"సారీ శిల్పా. నిన్ను చాలా బాధ పెడుతున్నాను కదూ."

తప్పంతా తనదే అన్నట్టుగా దోషిలా తలవాల్చి సంజాయిషీ ఇస్తుంటే ఇటువంటి మనిషినా ఇన్నాళ్ళూ తను అపార్ధం చేసుకున్నదీ అన్న ఆలోచన ఆమె మనసును మెలితిప్పింది.

ఆఫీసుకు వెళ్తూ మరో మారు శిల్ప గదికి వచ్చాడు కిరీటి.

"ప్లీజ్ శిల్పా! అనవసరమైన ఆలోచనలతో మనసు పాడు చేసుకోకు."

అతడి కళ్ళలోకి సూటిగా చూడలేకపోయింది.

"పోనీ ఆఫీసుకు వెళ్ళటం మానేశాదా?" ఆజ్ఞాపించమన్నట్టుగా వుంది అతడి గొంతు....

"లేదు మీరు వెళ్ళి రండి" కిరీటి వెళ్ళిపోయాడు.

రాత్రి చాలా సేపటి వరకు మేల్కగానే వుండటంతో నానీ ఇంకా నిద్రలేవలేదు.

తేలిక పడ్డ మనసుతో శిల్ప కాలకృత్యాలు ముగించుకుంది.

తనకోసం ఏమైనా చేయగల కిరీటికి తను కొంతైనా చేయకపోతే తన బ్రతుక్కే అర్థం లేదన్న సంకల్పానికి వచ్చింది.

కిరీటికి తను దూరంగా బ్రతకలేదు.

అనురాగంతో మధ్యనున్న అగాధాన్ని పూడ్చేయాలి.

ప్రేమతో తనలో పెరిగిన ద్వేషాన్ని సమాధి చేయాలి....

తమ మధ్య స్పర్థలకిది చివరిరోజు కావాలి.

నిర్మలమైన మనస్సుతో అతడి పాదాలపై వ్రాలి అతడి స్పర్శతో నవరాగాలు చిలికే విపంచి కావాలి....

వర్షం కురిసిన రాత్రి అమరానందానుభూతిని కలిగించిన అతడి స్పర్శ గుర్తుకొచ్చిన శిల్ప సిగ్గుతో ముడుచుకు పోయింది.

సాయాంకాలమయ్యేసరికి నవవధువులా సింగారించుకుంది.

నిమిషాలను లెక్క పెడుతూ వాసకసజ్జికలా ఎదురు చూడసాగింది.

ఆమెకు మరో ఆలోచనలేదు... మరో ధ్యాసలేదు.

ఆమె మనసునిండా కిరీటి.....

రాత్రి ఎనిమిది గంటలు గడుస్తున్నా కిరీటి జాడలేక పోయేసరికి విరహోత్కంఠితయై దు:ఖాన్ని దిగమ్రింగుకో సాగింది....

రాత్రి తొమ్మిది గంటలకు భూషణ్ ఫోన్ చేసి చెప్పాడు.

కిరీటి అర్జెంట్ పనిమీద రాజమండ్రి వెళ్ళారని తెల్లవారే సరికల్లా తిరిగి వస్తాడని.

ఆమె నిరీక్షణ వ్యర్థమయ్యేసరికి ఏడుపొచ్చింది.

ఎంతగానో వూహించుకున్న ఆ రాత్రి ఒంటరిగా గడపాల్సి వచ్చేసరికి ఆమె నిద్రకు దూరమైంది.

మరుసటి రోజు ఉదయం పదిగంటలవేళ పోర్టికోలో ఆగిన కారు చప్పుడు కావటంతో ఉత్సాహంగా వెళ్ళింది.

కారు దిగిన కిరీటితో పాటు మరో స్త్రీ .....

“అంకుల్” నానీ హుషారుగా ముందుకు పరిగెత్తాడు.

ఎదురుగా నిలబడ్డ స్త్రీవేపు ఎగాదిగా చూసి “అంకుల్ మమ్మీ కదూ” రహస్యంగా అడిగాడు ఫొటోలో తప్ప నానీ తల్లిని అంతవరకు చూడలేదు.

“యస్ నానీ... మమ్మీయే...”

కిరీటి చెప్పగానే చేతులు చాచిన ఆ స్త్రీ ఒడిలో ఒదిగిపోయాడు నానీ....

ఆ సన్నివేశాన్ని చూస్తుంటే కిరీటి నేత్రాలు అశ్రుసిక్తాలవటం శిల్ప గమనించకపోలేదు. శిల్పకిదంతా అయోమయంగా వుంది.

తల్లికి కొడుకును, కొడుక్కి తల్లిని పరిచయం చేయటం విచిత్రమే మరి.

ఖరీదైన చీరపై షాల్ కప్పుకుని ఆకర్షణీయంగా వున్న ఆ స్త్రీ ఎవరైనదీ శిల్ప గ్రహించక పోలేదు.... అయితే ఆమె నుదుట బొట్టెందుకు లేదో ఆమెకు అర్థం కాని విషయం.

“కన్యా! యీమె నా భార్య శిల్ప.” పరిచయం చేశాడు కిరీటి .

“నమస్తే” సంస్కారం వుట్టి పడేట్టుగా చేతులు పైకెత్తిన కన్యకు ప్రతి నమస్కారం చేయాలనిపించలేదు శిల్పకు.

కొండ చిలువలా చుట్టేసిన అనుమానంతో నిలబడ్డ శిల్పకు కన్య ఓ ఆగర్భ శత్రువులాగా కిరీటికి తనకూ మధ్యన వున్న ఇనుపతెరలాగా అనిపించింది.

ఈతరాని ప్రాణి సుడిగుండంలో చిక్కుకుని ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్టుగా వుంది శిల్ప పరిస్థితి.

కన్యతో సహా కిరీటి మేడపై గదికి వెళ్ళాడు.

నిర్వేదంతో గదిలోకి నడిచింది శిల్ప.

ఏదైతే కాకూడదని ఇన్నాళ్ళూ కలలు కందో, ఏ అనుబంధాన్ని ద్వేషిస్తూ ఇంతకాలం కిరీటికి దూరమైందో అదే మళ్ళీ పెనుతుఫానులా తనబ్రతుకులోకి ప్రవేశించింది.

అది పరోక్షం... ఇది ప్రత్యక్షం ...

తేడా అది మాత్రమే.....

కిరీటికి ఇక తను చేరువ కాలేదు.... కాదు కన్య చేరువ కానివ్వదు.

అదే సదభిప్రాయంతో యీ యింట అడుగుపెట్టి వుంటుంది.

శాశ్వతంగా ఇక్కడే తన పాలిటి శాపంలా అనుక్షణమూ తనను వేధిస్తూనే వుంటుంది.

నానీని కూడా తనకు దూరం చేస్తారు.

పూర్తిగా తనను ఒంటరిదాన్ని చేసి సాధించి బయటకు సాగనంపుతారు.

అదే వాళ్ళ ప్రణాళిక...

ఆరోజు కిరీటి ఆఫీసుకి వెళ్ళక పోవటమూ రోజంతా కన్య గదిలోనే గడపటం తనంటూ ఒకతే వుందన్న విషయాన్ని మరచి మంతనాలు జరపటం శిల్పకు భరింప శక్యం కాలేదు.

అందుకే ఆరోజు శిల్ప భోజనం కూడా చేయటం మానేసింది.

నిజంగా కిరీటికి తనంటే ప్రేమే వుంటే తన గదికి వస్తాడని వచ్చి భోజనం చేయమని బలవంతం చేస్తాడని ఎదురు చూసిన శిల్పకు నిరాశే మిగిలింది.

సునీత రాతలు బూటకంగానూ, తను స్పృహ తప్పినట్టు నటించిన నాటి కిరీటి ప్రవర్తన నాటకంగానూ అనిపించింది.

ఆ రాత్రి నానీ వచ్చి "భోంచేద్దాం రా ఆంటీ " అని బలవంతం చేస్తూంటే తనకు ఒంట్లో బాగాలేదని తప్పించుకుంది.

తనకోసం అంత ఆరాటపడే నానీని ప్రేమగా గుండెలకు హత్తుకుంది.

పసిపిల్లాడికున్న ఔదార్యం కూడా కిరీటిలో లేకపోయేసరికి ఆమెకు రోషంతో దు:ఖం ముంచుకొచ్చింది.

## 14

అర్థ రాత్రి....

హఠాత్తుగా మెలుకువ వచ్చింది శిల్పకు.

బెడ్ లైట్ కాంతిలో ప్రక్కకు చూసింది.

తనప్రక్కనే కావలించుకున్న పడుకున్న నానీ లేడు.....

ఏమయ్యాడు...?

నానీ తనంతట తానుగా వెళ్ళి వుండడని గ్రహించింది.

కోపంగా కిరీటి గదిలోకి వచ్చింది.

అక్కడ కిరీటి లేడు.

మనసులో సుడులు, అనుమానం.... గుండెల్ని  కాల్చుతున్న అవమానం.....

మేడపైన  గదిలోకి వెళ్ళి చూడాలనిపించింది.

వెళ్ళాలా వద్దా అని కొన్ని క్షణాలుపాటు సందిగ్ధంలో నిలబడి చివరకు వెళ్ళటానికి నిర్ణయించుకుని మేడపైకి  వెళ్ళింది.

కన్య గదిలో లైటు వెలుగుతుంది.

సవ్వడి చేయకండా సమీపించి ఓరగా తెరిచి ఉన్న కిటికీలోనుండి లోపలకు చూసింది.

కన్య పరుపుపై నానీ నిద్రపోతున్నాడు.

తలవంచుకుని కూర్చున్న కన్యను ఓదార్చుతున్నట్టుగా సమీపంలో ఓ కుర్చీలో కూర్చున్నాడు కిరీటి.

ఎంతటి సాహసం....!

తన ఉనికినే గుర్తించకుండా ఎంత ధైర్యంగా ఒకే గదిలో గడపగలుగుతున్నారు.

పైగా వేళగాని వేళలో సాంత్వన వచనాలు చెబుతున్నాడా......

ఎంత ప్రయత్నించినా కిరీటి మాటలు శిల్పకు స్పష్టంగా వినిపించటంలేదు.

గదిలోకి వెళ్ళి ఇద్దరినీ కడిగేయాలనిపించింది. ఛీ ఛీ... బరితెగించిన వాళ్ళమధ్యకు తనెందుకు వెళ్ళాలి?

తనకేదో కీడు సంకల్పిస్తూ జరిపే రహస్య సమాలోచనలో తనెందుకు జోక్యం చేసుకోవాలి.

తను రాజా నరేంద్రదేవ్ మనువరాలినని నిరూపించాలి.

బయటకు నడవబోయిన శిల్ప సమీపంలో నిలబడ్డ కిరీటిని చూడగానే అదిరిపడింది.

అతని  తీక్షణ దృక్కుల్ని తట్టుకోవటం దుస్సహమనిపిస్తున్నా  సన్నగిల్లి పోతున్న ధైర్యాన్ని కూడగట్టుకుని  తనూ సూటిగానే చూసింది.

"ఏమిటి ...దొరికిపోయినందుకు సిగ్గుగా  వుందా ...?"

హఠాత్తుగా  ఆమె నోరునొక్కిన కిరీటి ఆమెకు మాట్లాడే అవకాశమివ్వకుండా క్రిందికి లాక్కొచ్చాడు.

పట్టు విడిపించు కోవాలని ఎంత ప్రయత్నించినా ఆమెకు సాధ్యం కాలేదు.

శిల్ప గదిలోకి వచ్చాక పట్టు సడలించాడు.

"ఛీ ఛీ.... వదలండి" గట్టిగా అతని చేతుల్ని విదిలించుకుంది.

పగలడానికి సిద్ధంగావున్న అగ్నిపర్వతంలా వుంది ఆమె.

"నెమ్మదిగా మాట్లాడు"

"ఏం గట్టిగా మాట్లాడితే ఆవిడగారు బాధపడిపోతుందనా " రొప్పుతూ అడిగింది.

"మీరు సంస్కారం గురించి మాట్లాడుతున్నారా?" వికృతంగా నవ్వింది.

"వండర్‌ఫుల్ మిష్టర్ కిరీటి! కట్టుకున్నది ఇంటిలో ఉండగా తెచ్చిపెట్టుకున్న దానితో అర్ధరాత్రి సరసాలు మొదలుపెట్టిన మీరు నా సంస్కారాన్ని ఎత్తి చూపిస్తున్నారా? డబ్బు మదంతో మీరేం చేసినా చెల్లుతుందని ఒక ఆడదాన్ని తల్లిని చేసి మరో ఆడదానికి తాళి కట్టిన మీరు సంస్కారం గురించి హితభోధ చేస్తున్నారా...షేమ్..."

విపరీత సంఘర్షణకు లోనై నలిగిపోయాడు కిరీటి.

"ఏమైంది కిరీటిగారూ... ఏం చెప్పాలో అర్థంకాక మెలితిరిగిపోతున్నారా...? ఎలాంటి కథ అల్లాలో తెలియక తల్లడిల్లిపోతున్నారా....?"ఎగతాళి ధ్వనించింది ఆమె కంఠంలో.

"కాదు.... కోరి కోరి నీకు తాళి కట్టినందుకు పశ్చాత్తాప పడుతున్నాను. అతి త్వరగా నీ నోరు ఎలా మూయించాలా అని ఆలోచిస్తున్నాను." అతని గొంతు జీరబోయింది.

"మీరు చేసే ప్రతి పనిని ప్రేక్షకురాలిగా నోరు మూసుకొని చూస్తూంటానని అనుకోవటం మీ భ్రమే మిష్టర్ కిరీటి "

కాస్త ప్రశాంతతను చిక్కబట్టు కోవాలన్నట్టుగా కొంతసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"శిల్పా.... కన్య నువ్వనుకుంటున్నట్టు నాప్రియురాలు కాదు. నువ్వు,నేను అనుభవిస్తున్న ఈ ఆస్తికి వారసురాలు"

నచ్చచెబుతున్నట్టుగా మరేదో అనబోయేలోగా ఫకాలున నవ్వింది శిల్ప.

"వెరీగుడ్... ఇప్పటికి తట్టిందన్నమాట, ఏం కట్టుకథ చెప్పాలో. ఊ చెప్పండి... ఈ ఆస్తికి వారసురాలు... ఆ తర్వాత.... చెప్పండి."

ఆమె గొంతులోని హేళన్ని భరించలేనట్టుగా బయటికి నడిచాడు కిరీటి.

కన్య వినకూడదని శిల్పను క్రిందకి లాక్కు వచ్చిన కిరీటికి కన్య తమ మధ్య జరిగిన వాగ్యుద్ధాన్నంతా విందన్న విషయం అప్పటికి తెలీదు.

## 15

శిల్పకు కన్యన్నా, కిరీటి అన్నా విపరీతమైన ద్వేషం పెరగటంతో ఎట్టి పరిస్థితుల్లోనూ వాళ్ళకెదురు పడకూడదని నిర్ణయించుకుంది.

వాళ్ళున్నారని తెలిస్తే డైనింగ్ హాల్లోక్కూడా వెళ్ళేదికాదు.

అయితే ఒంటరితనంతో వేగిపోతున్న తనకు సంతోషాన్ని కలిగించే నానీకి దూరంగా బ్రతకటం దుర్భరమనిపించటంతో ఎవరూ చూడనప్పుడు చేరదీసేది.

కన్యగాని, కిరీటి గానీ గమనిస్తున్నారని తెలిస్తే ముభావంగా ఉన్నట్టు నటించేది.